అడుగంటిన మత్తడివాగు

- 270.5 మీటర్లకు చేరిన నీటిమట్టం
- ఏడారిని తలపిస్తున్న ప్రాజెక్టు పరిసరాలు

తాంసి: రోజురోజుకు ఎండల తీవ్రత మరింత పెరుతుండడంతో వాగులు, చెరువుల, ప్రాజెక్టుల్లోని నీరు పూర్తిగా ఎడిపోతుంది. ప్రధాన ప్రాజెక్టులోని నీరు సైతం అడుగంటి ఏన్నడూ లేని విధంగా ప్రాజెక్టులు ఎండిపోయాయి. మండల రైతులకు సాగు నీటి వనరుగా ఉన్న మత్తడివాగు ప్రాజెక్టులో సైతం అడుగంటింది. నీటిమట్టం తగ్గి నీరు డెడ్ స్టోరేజీకి చేరువలో ప్రమాదకర స్థాయికి నీరు పడిపోయింది. పూర్తి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా.. ప్రస్తుతం 270.5 మీటర్ల వద్ద నీరు ఉంది. 270 మీటర్లకు ప్రాజెక్టు నీటిమట్టం చేరితే ప్రాజెక్టు నీరు డెడ్ స్టోరేజీకి చేరినట్లే. నీటిసామర్థ్యం 0.57 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేవలం ప్రాజెక్టు గేట్ల వద్దనే నీరు ఉంది.

ప్రమాదకర స్థాయికి..

మండలంలోని వడ్డాడి గ్రామంలో రైతులకు సాగు నీటిని అందించే ప్రాజెక్టులో నీరు ప్రమాదకర స్థాయికి తగ్గింది. ప్రాజెక్టు ప్రారంభమై 16 సంవత్సరాలు అవుతున్నా.. ఏ ఒక్క సంవత్సరం కూడా ప్రాజెక్టు నీటిమట్టం ఇంతగా తగ్గలేదు. వేసవి పూర్తికాక ముందే ప్రాజెక్టు నీరు పూర్తిగా అడుగంటేలా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వాగుల ద్వారా నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ప్రాజెక్టులోకి నీరు చేరడం లేదు. 300 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న



ఎడారిగా మారిన మత్తడివాగు ప్రాజెక్టు

ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది.

ఎడారిని తలపిస్తున్న ప్రాజెక్టు..

నిత్యం నిండుకుండలా కనిపించే మత్తడివాగు ప్రాజెక్టు ప్రస్తుతం నీరు తగ్గడంతో ఎడారిని తలపిస్తోంది. వందల ఎకరాల్లో నీటి నిల్వ లేకుండా పోయింది. ప్రాజెక్టు నీటిమట్టం తగ్గడంతో అక్కడ అక్కడ గడ్డి పెరిగి పచ్చగా కనిపిస్తోంది. చుట్టూ పక్కల గ్రామాల పశువుల కాపర్లు పశువులను మేత కోసం ప్రాజెక్టు వద్దకు తీసుకెళ్తున్నారు. వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ప్రాజెక్టు అందాలను తిలకించేవారు. ప్రస్తుతం నీరు లేక ప్రాజెక్టు పరిసరాలు బోసిపోయి కనిపిస్తున్నాయి.

కొంత మాత్రమే నీరు ఉంది

ప్రస్తుతం ప్రాజెక్టులో కొంత మాత్రమే నీరు నిల్వ ఉంది. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఈఏడాది నీటిమట్టం త్వరగా తగ్గింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా సాగునీరు అందించే అవకాశం లేదు. ప్రాజెక్టులో 270.5 మీటర్ల వద్ద ప్రస్తుతం నీరు ఉంది. మరో 0.5 మీటర్ల నీరు తగ్గితే ప్రాజెక్టు నీరు డెడ్ స్టోరేజీకి చేరుతుంది.

– హరీష్‌కుమార్, ఏఈ, మత్తడివాగు ప్రాజెక్టు

'రమాబాయి త్యాగం మరువలేనిది'



పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేసిన మహనీయురాలు రమాబాయి అంబేడ్కర్ త్యాగం మరువలేనిదని మహామయ ఉపాసిక సంఘం మండల అధ్యక్షురాలు సోమోరే మాయబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలనీ గల త్రీరత్న బుద్ధవిహార్‌లో రమాబాయి అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ప్రతీ మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంరాజ్, ప్రభావతి, మాయావతి, ఉషబాయి, లతబాయి, మస్కే రాజవర్ధన్, గౌతం, లక్ష్మణ్, కచ్చుబా, దయానంద్ పాల్గొన్నారు.



సొనాలలో..

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం రమాబాయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఎదుగుదలలో రమాబాయి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు పాటిల్ తిరుమల, పాటిల్ మమత జనాభాయి, రుక్మ భగత్, కిరణ్, అమృత్‌రావ్ పాటిల్, మునేశ్వర్ సోమన్న, బూర్తుల స్వామి పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతు



విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

తాంసి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన గాలివానకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. తాంసి, కప్పర్ల, హస్నాపూర్, పొన్నారి, వడ్డాడి, జామిడి గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వంగడంతో పాటు నెలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ ఏఈ మనోజ్ కుమార్ సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో దెబ్బ తిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ మరమ్మతులను ముమ్మరం చేస్తున్నారు.

నెహ్రూ సేవలు చిరస్మరణీయం

కైలాస్‌నగర్: భారత ప్రధానిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత తొలి ప్రధానమంత్రిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నాగరాజు, మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, నలిమేలా నవీన్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, సావిన్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.



జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వంగుతున్న విద్యుత్ స్తంభాలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి వయా లాండసాంగ్వి మీదుగా జైనథ్‌కు గత మూడు నెలల క్రితం 33/11 కేవీ విద్యుత్ స్తంభాలు వేశారు. అప్పుడే పలు విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగి దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉందని అటువైపు నుంచి వెళ్తున్న పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోక ముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– ఆదిలాబాద్‌రూరల్

అధికారుల నిర్లక్ష్యంతోనే నకిలీ విత్తనాలు



మాట్లాడుతున్న అరెల్లి మల్లేశ్

ఇచ్చోడ: అధికారుల నిర్లక్ష్యంతోనే జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల క్రయా విక్రయాలు జరుగుతున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. అనుభవం లేని వారికి ఫర్టిలైజర్ దుకాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్లో లభిస్తున్నాయన్నారు. ఇటీవల నకిలీ పత్తి విత్తనాల విక్రయించిన వారిపై పీడీయాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బరుకుంట సుభాష్, చిట్టి రవి, పసుల శ్రీకాంత్, దుబాక చందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో వివేక్

జాగ్రత్తలు తప్పనిసరి

జైనథ్: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఏవో వివేక్ సూచించారు. సోమవారం మండలంలోని పెండల్‌వాడ గ్రామంలోని రైతువేదికలో మాట్లాడారు. లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, రసీదుపై రైతు పేరు, ఊరు, విత్తనం లాట్ నంబరు, ప్యాకెట్‌ల సంఖ్య, రైతు, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో తౌసీఫ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



సుర్జాపూర్‌లో పోషకాహారం ఇస్తున్న శ్రీలత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, గంగాయిపేట్, సుర్జాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ శ్రీలత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల కు వచ్చే చిన్నారులకు శుభ్రమైన వంటపాత్రల్లో పోషకాహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు, హెల్పర్లు ఉన్నారు.



కడెం: లంబడితండాలో పరిశీలిస్తున్న రాధ

కడెం: మండలంలోని ఉడుంపూర్ లంబడితండా, ఇస్లాంపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

పారితోషికం చెల్లించాలని వినతి

ఖానాపూర్/కడెం: ఎన్నికల విధులు నిర్వహించిన తమకు పారితోషికం చెల్లించి సమస్యలు పరిష్కరించాలని బీఎల్‌వోలు కోరారు. సోమవారం ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల బీఎల్‌వోలు తమ సమస్యలపై ఉట్నూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో భీంరావుకు వినతిపత్రం అందజేశారు. నూతన జీవో ప్రకారం పారితోషికం, ఎన్నికల సమావేశాలకు వచ్చిన బీఎల్‌వోలకు టీఏ, డీఏలు చెల్లించాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఎల్‌వోల సంఘం జిల్లా నాయకులు గుడిసె సంపూర్ణ, విజయనిర్మల, మంగమ్మ, వరలక్ష్మి, సుకన్య, సత్య, రాజేశ్వరి, జన్ను, వైష్ణవి, మంజుల, తదితరులు ఉన్నారు.



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీఎల్‌వోలు

నత్తనడకన పనులు



నాసిరకంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు

- బేల జెడ్పీహెచ్ఎస్‌కి నిధులే నిధులు
- నాసిరకంగా మనఊరు.. మనబడి పనులు
- ఏడాదిగా సాగుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం

బేల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిధులు ఉన్నా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఈ పాఠశాలలో ఏడాదిన్నరగా నిధులు మంజూరవుతున్నాయి. మన ఊరు.. మన బడి పనులు అధికారుల నిర్లక్ష్యంతో నాసిరకంగా చేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే గత నెల నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలలో ఇంగ్లీషు, మరాఠీ మీడియంలో ప్రతీ విద్యా సంవత్సరంలో 700కు పైబడి విద్యార్థులు చదువుకుంటారు.

నిధులే నిధులు..

బేల జెడ్పీహెచ్ఎస్‌కు మన ఊరు.. మన బడి పథకం కింద అదనపు తరగతి గదుల నూతన భవన నిర్మాణాలు, డైనింగ్ హాల్, నీటి సౌకర్యం, తరగతుల్లో ఫ్యాన్లతో పాటు ట్యూబ్‌లైట్‌లు, ఇతర మరమ్మతుల కోసం రూ.85 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2022- 23విద్యా సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 6 యూనిట్ల మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణం కోసం రూ.21 లక్షలు మంజూరయ్యాయి. 2023- 24విద్యా సంవత్సరంలో మరో 6 యూనిట్ల మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ. 24.60 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పాటు పీఎంశ్రీ పథకం కింద అదనపు తరగతి గదుల నూతన భవనాల నిర్మాణం కోసం రూ.3.10 కోట్ల మంజూరు కాగా.. మొదటి దఫాలో రూ. 27లక్షల నిధులు విడుదలయ్యాయి. ఈ పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. దీంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ.8.20 లక్షలు మంజూరయ్యాయి.

నాసిరకంగా పనులు..

ఈపాఠశాలలో నిధులు రూ.85లక్షల వ్యయంతో మన ఊరు.. మన బడి పనులు చేపట్టారు. మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. కానీ తలుపులు, కిటికీలు ఇంకా బిగించలేదు. డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టలేదు. నీళ్ల సౌకర్యం కోసం నల్లాలు నాసిరకంగా చేపట్టడంతో మరమ్మతుకు వచ్చాయి. ఫ్యాన్ల రెక్కలు విరిగిపోయాయి. ట్యూబ్ లైట్లు సరిగా బిగించలేదు.

అమ్మ ఆదర్శ పనులు..

ఈ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద నిధులు రూ.8.20 లక్షలు మంజూరయ్యాయి. గత నెల నుంచి పనులు కొనసాగుతున్నాయి. అదనపు తరగతి గదుల భవనంలో పై అంతస్తుకు రేలింగ్ నిర్మాణం చేపట్టారు. ఫ్యాన్‌ల బిగింపు, గేటు బిగింపు, ముఖ ద్వారంతో పాటు సీసీరోడ్డు నిర్మాణం, మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి.

చర్యలు తీసుకోవాలి



బేల జెడ్పీహెచ్ఎస్‌లో మన ఊరు.. మన బడి పథకం కింద రూ.85 లక్షలతో చేపట్టిన అన్ని పనులు ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లోపంతో నాసిరకంగా జరుగుతున్నాయి. నల్లాలు సరిగా పనిచేయక మరమ్మతులకు వచ్చాయి. నాసిరకం పనులపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.

–మాడవార్ హరీష్‌రెడ్డి, జిల్లా ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్

అధికారులు పట్టించుకోలేదు



బేల జెడ్పీహెచ్ఎస్‌లో చేపట్టిన పనులు నాణ్యతపై ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో పనులన్నీ అస్తవ్యస్తంగా చేశారు. ఫ్యాన్ల గాలి సరిగా రాకపోగా, ఒక నెలకే ఫ్యాన్ల రెక్కలు విరిగాయి. పాత గదులకు బిగించిన తలుపులు ఊడిపోయి, ఊగుతున్నాయి. నాసిరకం నల్లాలు బిగించారు.

– కోల నర్సింలు, హెచ్ఎం

క్లుప్తంగా

అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన



పనులు పరిశీలిస్తున్న అధికారి

నేరడిగొండ: అమ్మ ఆదర్శ పాఠశాలలను సోమవారం ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య సందర్శించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, బంధంరేగడి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల్లో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ సంజయ్, ఎంపీడీవో రాజ్‌వీర్ పాల్గొన్నారు.

కళాజాత ప్రదర్శన



బస్టాండ్ వద్ద ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం వార సంతలో తెలంగాణ సంస్కృతిక సారథి ఆధ్వర్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతపై కళాకారులు కళాప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలకు కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు గుంజాల రమేశ్, గట్టు వెంకట్‌రావు, గోవింద్‌రావు, శంకర్ రాథోడ్, రాజలింగు, ఆశిష్, నగేశ్, రాజు, శ్రావణ్, శిరీష, నరసమ్మ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని విత్తన దుకాణాలను ఏఈవో శివకుమార్ సోమవారం తనిఖీ చేశారు. విత్తన దుకాణాల్లో నిల్వ ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. రైతులతో మాట్లాడి విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వారి వెంట రైతులు ప్రకాష్, రాజు, నంద్ పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్‌కు చెందిన రైతు పోలే విష్ణుకు చెందిన ఆవు మృతి చెందడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆవును ఎడ్ల బండిలో ఉంచి పూజించి చేనులో అంత్యక్రియలు చేశారు.

బర్డ్ ఫీడర్ అందజేత



కలెక్టర్‌కు బర్డ్‌ఫీడర్ అందజేస్తున్న వెంకటేశ్

బోథ్: వేసవిలో ఎండలతీవ్రత అధికంగా ఉన్నందున ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద బర్డ్ ఫీడర్ ఏర్పాటు చేసి, పక్షుల దాహార్తిని తీర్చాలని బోథ్ మండల కేంద్రానికి చెందిన పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. ఈసందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంను కలిసి బర్డ్ ఫీడర్ అందజేశారు. పక్షుల దాహార్తిని తీర్చేందుకు వెంకటేశ్ చేస్తున్న కృషిని వారు అభినందించారు.

రైతులకు నష్టం చేస్తున్నారని ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నాయకులు

ఖానాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇష్టానుసారంగా ధాన్యం తూకంలో కోతలు విధిస్తూ రైతులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నారని రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోసంపల్లె, గోడలపంపు, పాతఎల్లాపూర్ గ్రామాల రైతులు నిర్మల్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. భైంసాలోని ఓ రైస్‌మిల్లులో రైతులు విక్రయించిన ధాన్యం నుంచి ఇష్టారాజ్యంగా విధిస్తున్న కోతలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలో క్వింటాలుకు ఐదు కిలోలు కోత విధిస్తూ.. తూకం వేసిన ధాన్యానికి సంబంధించిన రసీదులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అల్లెపు పీటర్, కరిపె ప్రకాశ్, డి.కుమార్, ఈసారపు నవీన్, లక్ష్మీరాజు ఉన్నారు.

పరామర్శ

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన విలేకరి రాథోడ్ సిద్దార్థ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం సిద్దార్థ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. చిన్న వయస్సులో మృతి చెందడం బాధాకరమన్నారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటానన్నారు. ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, తిరుమల్ గౌడ్, రమేశ్ జాదవ్, రవీందర్‌నాయక్, భీంరావ్ నాయక్, ప్రతాప్ సింగ్, మాధవ్ తెలంగే ఉన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తోన్బు నిఖిల ఆదివారం మత్తడి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నాయకులు గంగయ్య, మహేందర్, షేక్ అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు అన్నారు. ఉట్నూర్ మండలంలోని సాకెర గ్రామంలో ఎంపీ సోయం బాపురావుతో కలిసి పెర్సాపెన్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీలు ప్రకృతిని దైవంగా భావించి నియమ నిష్టాలతో పూజలు చేసి సంస్కృతి, సంప్రదాయాలను ఆచార వ్యవహారాలను యావత్ ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందన్నారు. నేటి యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899